# పచ్చపువ్వుల పట్టుచీర



డా॥ అందే గోపాలకృష్ణమూర్తి

పోస్టాఫీసు దగ్గర బయల్దేరిన నెంబర్ టెన్ సిటీ బస్సు ఆ రోజెందుకో ఖాళీగా ఉంది. ముందు సీట్లో ఇద్దరూ, వెనకాల నలుగురైదుగురూ తప్ప అసలు లోడే లేదు!

'స్టార్ట్ చెయ్యోయ్ జహంగీరూ!' అన్నాడు కండక్టర్ రాజు, ఇంకా ఎవరైనా పాసెంజర్లు వస్తారేమోనని 'బ్రేకు' వేసిన డ్రైవరుతో.

'ఈగల్తోలుకుంటూ యెళ్ళడమే!' అంటూ స్టార్ట్ చేసేడు. బీడీముక్క ఆఖరి దమ్ము లాగి బైటికి గిరాటేసిన డ్రైవరు.

లక్ష్మి టాకీసూ, బస్టేండూ, పూర్ణా మార్కెట్టూ, జేరెక్సూ, ఎల్లమ్మ తోటా, అన్నీ దాటినా...అస్సే .'లోడే లేదూ!' విసుక్కున్నాడు రాజు.

'ఈయ్యేళ యెవెడైనా మినిస్ట్రుగానీ, పెద్దమనిషీగానీ కునికేసేడేటీ, ఏ నాయాల బస్సు జోలికి రాడంలేదు?' మరో బీడీ వెలిగిస్తూ అడిగేడు జహాంగీరు.

కె.జీ. హాస్పిటలు ఓ.పీ. గేటు దగ్గర బస్సు ఆగింది. ఉన్న పదిపదిహేను మందిలో ముప్పాతిక దిగిపోయేరు.

"రావారీ, కలెక్ట్రాఫీసూ, సెంచరీ క్లబ్బూ, ఆర్కేమిషనూ, యూనివర్సిటీ.... యూనివర్సిటీ ." క్లీనర్ కుర్రోడు ఉషారుగా పాడేస్తున్నాడు. అనక ఎవరూ రాకపోడం చూసి 'రైట్రైట్' అని డబ్బా కొట్టినట్టు బస్సుని కొట్టేడు. బస్సు కాస్తా రైట్రైటై, కలెక్టరాఫీసు దాటి, జిల్లా పరిషత్తు జంక్షన్‌లో ఆగింది.

"ఓహో, గొప్ప టైంకొచ్చేం. లేకపోతే ఎనకాల ఆకులోడి బస్సు కాస్తా ఈ లోడు లాక్కుపోను!" ఆనందంగా అన్నాడు డ్రైవరు, అక్కడ మందలు మందలుగా వున్న 'లేడీస్టాస్టలు ఆడంగుల్ని' చూసి.

ఒకర్నొకరుతోసుకుంటూ, "కమాన్, కమాన్ గెటిన్, గెటిన్ వే", "ఎక్కవే. అరెరె .. ఎందుకండీ తోస్తారూ? ..", "ఐసే ప్లీజ్ లెట్ మి గెటిన్....", "మిస్టర్, వుడ్ యూ ప్లీజ్ వెకేట్ దిస్ సీట్!...." రకరకాల దేశభాషల నుపయోగిస్తూ బస్సులోపలికి చొచ్చుకుపోయారు సుమారు ముప్పైనలభై మంది యూనివర్శిటీ అమ్మాజీలు.

"రైట్ రైట్ ఎక్కడా ఆపక . పోనీయ్ తిన్నగా యూనివర్సిటీ " క్లీనర్ కుర్రాడు హుషారుగా 'ఈల'వేసేడు.

* * *

"ఎవరే ఇతనూ, అలా దేబిరించి చూస్తున్నాడూ?" ఎదుటి సీట్లో 'పింక్

కేళ్ళ అబ్బాయి గురించి అనుమానం పెల బుచ్చింది శాంతి.

"బహుశా గుడ్డోడేమో!" నవ్వింది జ్యోతి.

"అంటే కూలింగ్ గ్లాసెస్ పెట్టు కున్నోళ్ళంతా గుడ్డోళ్ళే నంటావా?" గట్టిగా అంటూ, విరగబడి నవ్విన శాంతి, ఎదుటి వ్యక్తి ముఖంలో ఏ మార్పూ రాకపోయే సరికి ఆశ్చర్యపోయింది. మెల్లగా జ్యోతి చెవివైపు వంగి "నిజంగా బ్లైండ్ ఫెలో నేమోనే, పాపం!" అన్నది సానుభూతిగా.

"అయినా అవ్వచ్చు. ఎందుకంటే, ఆమధ్య ఓ కథ చదివేను. రైల్లో ఇలాగే, ఓ నల్లకళ్ళద్దాలబ్బాయి కూర్చునుంటాడు. ఎదురుగా ఓ అందమైన అమ్మాయీ, వాళ్ళ నాన్నగారూ కూర్చునుంటారు. నల్లకళ్ళద్దాలబ్బాయి తననే అదే పనిగా చూస్తున్నాడనుకొని, అమ్మాయి ఓ . ఇది ఫీలైపోయి ఆ అబ్బాయిని తిట్టు కొంటుంది. తర్వాతి స్టేషన్లో ఆ అబ్బాయి పాపం! ఎవరిసాయంతోనో ..ప్లాట్ఫాం మీదకు దిగుతాడు. అతన్ని రిసీవ్ చేస్కోం దుకు వచ్చినాయన, ఈ దింపినాయనకో థేంక్స్ చెబుతూ, 'అబ్బాయికి చూపు లేదండీ, చాలా ధన్యవాదాలూ!' అంటాడు. ఆ అమ్మాయి పాపం! షాక్తిని, సదరు అబ్బాయి మళ్ళీ కనిపిస్తే ఎపాలజీస్ చెప్పుకొందామనుకొంటుంది. కానీ, రైలులో ఎంతమందిని చూస్తాం?.... అలాగా, ఈ 'కేండిడేటు' కూడా, చూస్తుంటే, అదే కోవకు చెందినట్టు న్నాడే శాంతీ!—

స్టాం పన్నాక శాంతి మనసు నీరై పోయింది.

"సిరిపురం దిగాలి బాబూ, దిగాలి బాబూ ..." అరుస్తూ క్రిందకు దిగేడు క్లీనర్ కుర్రాడు.

అటువైపునుంచి వస్తున్న నెంబర్ టెన్, టైముకి గమ్యం జేరనందున ఇటు వైపు బస్సుకు అడ్డు నిల్చింది. ఫలితం— ఇరువర్గాలవారూ పోరాటం!

"ఇతను గుడ్డోడిలా లేడే జ్యోతీ!" మెల్లిగా అన్నది శాంతి.

"ఐతే, మనం మోస్తున్నా. ఎందు కసలు రియాక్షన్ లేదూ?" అడిగింది జ్యోతి, బస్సు ఆగిపోడానికి కారణ మేమిటా అని డైటికి చూస్తూ.

"నిజమేనే శాంతి! ఎందుకలా నీ వైపే కాన్స్టెంట్గా చూస్తున్నాడూ? ఊం? బహుశ, ప్రేమించేసేడేమో!" ఆఖరి వాఖ్యం శాంతి చెవిలో చాలా మెల్లగా అన్నది జ్యోతి.

"ఊర్కో జ్యోతీ! డోంట్ బీ సిల్లీ గురుడూ, అసలు ఇంతకు ముందె ప్పుడూ ఆడముఖాల్ని చూడలేదేమో."

"అయితే మరి, అడపా తడపా, నా వైపు కూడా చూడొచ్చు గదా! .." అంటూ ఫక్కున నవ్వింది జ్యోతి.

"ఊం, మనిద్దర్లో, నేనే నచ్చేను గాబోలు!" మెల్లగా అంటూ కిసుక్కున నవ్వింది శాంతి.

" సర్లే . ఒప్పుకొన్నాం . . " మళ్ళీ నవ్వింది జ్యోతి.

రెండు నిముషాలు పోయాక ఇద్దరు

క్లాసుల్లోకి, డ్రైవర్లకి ఏం ఒప్పందం కుదిరిందో ఏమో, రెండు బస్సులూ ఎడా, పెడా 'రైట్ రైట్' అని స్టార్టయిపోయాయి.

"గురుడెక్కడ దిగుతాడో ఏమో" ఆర్ట్స్ కాలేజ్‌దగ్గర దిగుతూ అన్నది శాంతి.

"నీ కెందుకూ, 'ఇన్‌గేట్' దగ్గర దిగితేనే కనిపెడ్తాలే;" అంటూ శాంతికి 'టాటా' చెప్పింది జ్యోతి.

'ఇన్‌గేట్' దగ్గర దిగుతూ, జ్యోతి ఆ అబ్బాయివైపు సానుభూతిగా చూసింది. అతను అలానే కూర్చునున్నాడు.


"బహుశః ఔట్‌గేట్ దగ్గర దిగుతాడేమో!" అనుకుంటూ డిపార్ట్‌మెంట్‌వైపు స్పీడుగా నడిచింది జ్యోతి.

* * *

పుచ్చపువ్వులాంటి వెన్నెల. పిచ్చెక్కిచ్చేస్తూ 'బీచ్' అంతా ప్రవహించేస్తోంది.

హాస్టల్స్ రూల్స్ ప్రకారం ఎనిమిదింటికే 'శాఖాహారం' సేవించిన శాంతి హాస్టల్ టెర్రెస్‌మీద కూర్చుని, దూరంగా అగుపడ్తున్న చంద్రుణ్ణీ, సదరు 'చంద్రన్'ని చూసి ఎగిరెగిరి పడ్తున్న సముద్రుడి అలల్నీ గమనిస్తూండగా,

"షాంతీ, నీ లెటరు—బై—మిస్టేక్—నా రూంలో పడేసేడు పోస్టుమాన్. "విల్ యూ ప్లీజ్ కమ్ డౌన్!" అన్నదో కంచుకంఠం .టాప్ ఫ్లోర్



'థర్టి ఎయిట్' రూం నుంచి.

"యస్,కమింగ్ ఇన్ ఏ మోమెంట్" అంటూ క్రిందకు పరుగెత్తింది శాంతి.

*　　*　　*

గుండ్రని అక్షరాల్తో, నీట్‌గా వ్రాయబడిన ఎడ్రస్ చూసుకుంటూ 'ఎవరు చెప్తా' అన్న సందేహంతో కవరు విప్పింది శాంతి. ముత్యాల్లాంటి అక్షరాలు 'కుమారి శాంతిగార్కి' అంటూ ప్రారంభమైనయ్. చిన్నగా గుండె జల్లుమన్నది. అదోలాంటి వణుకు వ్రేళ్ళల్లో పాకింది. 'ఫ్రం' ఎడ్రస్‌కోసం లెటరు చివర చూసింది "మీరనుకున్న బ్లైండ్‌ఫెలో" కంగారుగా అనుకోకుండా రూమ్ లోపల గడియపెట్టుకున్నది శాంతి.

'హోగాడ్! వాటీజ్ దిస్?' రెస్ట్‌లెస్‌గా కుర్చీలో కూలబడి, టేబిల్‌లైట్ ఆన్‌చేసి చదవడం ప్రారంభించింది.


"కుమారి శాంతిగార్కి, నమస్తే! ఈ అపరిచిత వ్యక్తి ఎవరా అని ఆశ్చర్యపోకండి. నాలుగైదు రోజుల క్రితం బస్సులో మీ ఎదురుగా కూర్చునున్న పింక్ గ్లాసెస్ అబ్బాయిని. మీ దృష్టిలో 'గుడ్డోడిని'. లేదా 'బ్లైండ్‌ఫె'లోని.

ఆరోజు మీరూ, మీ స్నేహితురాలూ మాట్లాడుకుంటుంటే వినడం మూలంగా మీ పేరు 'శాంతి' అనీ, ఆవిడ పేరు జ్యోతి అనీ తెలిసింది. ఆనక మీరు ఆర్ట్సు కాలేజ్‌దగ్గర దిగిపోయారు గనక, మీరు ఏం చదువుతున్నదీ, హాస్టల్లో మీరు ఏ రూమ్‌లో ఉంటున్నదీ తెల్సుకోవడం అంత కష్టమవలేదు నాకు. అందుకే ఈ ఉత్తరం మిమ్మల్ని ఈ సమయానికి చేరుకున్నది. దయచేసి ఓపిగ్గా చదవండి.

శాంతీ, మీ రింకా చిన్నపిల్లల్లానే ప్రవర్తించడం నాకాశ్చర్యమేసింది. జీవితంలో మీరు చూసింది ఇంకా ఏమీ లేదు. హుషారుగా అల్లరీ, ఆటలూ, చదువూ—ఇదే స్టూడెంట్‌గా ఉండేటప్పుడు ప్రతివాళ్ళూ చేసే పని. అల్లరి చేయడం తప్పనడంలేదు. నా దృష్టిలో అందంగా అల్లరిచేయడం ఓ గొప్ప ఆర్టు. అల్లరి చేసేటప్పుడు ఎదుటి వ్యక్తి ఫీలింగ్స్‌ని 'హర్ట్' చేయకూడదు. ఫరెగ్జాంపుల్, ఆ రోజున నన్ను 'గుడ్డోడేమో'ననీ; 'బ్లైండ్‌ఫెలో' అనీ— అన్నారు. నిజంగా నా స్థానంలో ఒక 'గుడ్డి' వ్యక్తి ఉండే వుంటే, అతను మానసికంగా ఎంతటి చిత్రవధ అనుభవించి ఉండేవాడో ఊహించుకోండి. ఏ ఘోరమైన శాపం మూలంగానో జీవితాంతం చీకట్లోనే బతికే వ్యక్తికి ఊరట కల్గించి, జీవితంమీద నమ్మకం కల్పించాలేగానీ, అతన్ని కించపరిచి, హేళన చేస్తే, అటువంటి వ్యక్తి ఏ అఘాయిత్యానికైనా వెనుదీయడు. మీరు అమాయకంగా అల్లరే చేసుండొచ్చు. కానీ, అవతలి వ్యక్తి సెంటిమెంట్లు బల్లెంపోటు తినకూడదు. ఇక, అదటుంచండి.

ఆనాటి మీ సంభాషణలో 'మనం మోస్తున్నా ఎందుకసలు ఇతన్లో రియాక్షన్ లేదూ,' అనీ, 'అలా దేబిరించి చూస్తున్నాడేవిటీ' అనీ, 'ఇంతకుముందెప్పుడూ ఆడ ముఖాల్ని చూడలేదేమో'ననీ, ఎన్నో సందేహాలు ఉదయించినై మీకు. ఆ సందేహ నివృత్తిచేసి, మీకు కాస్త 'రిలీఫ్'

ఒరిజినల్ కురుక్షేత్ర ప్రదర్శనం!




కల్గించే ఉద్దేశంతోనే ఈ ఉత్తరం ఓపిగ్గా వ్రాస్తున్నాను. మీరూ కాస్త ఓపిగ్గా చదవండి.

శాంతీ, ఈ సృష్టిలో కొన్ని కొన్ని శాపగ్రస్త జీవితాలుంటాయి. ప్రాణంతీసి నరకంలోకో, స్వర్గంలోకో నెట్టివేస్తుంది 'మృత్యువు.' కానీ, బ్రతికుంచి నరకాన్ని చూపిస్తుంది 'శాపం.' అందుకే, నేను మృత్యువుని కోరుకుంటున్నా. అది నామీద దయచూపడం లేదు. మృత్యువుకన్న ఘోరమైనదీ భయంకరమైనదీ అయిన 'శాపం' నన్ను అనుక్షణం వెన్నంటి చిత్రవధ చేస్తూనే ఉన్నది. మీరెన్ని అనుకున్నప్పటికీ నాలో ఎటువంటి రియాక్షనూ లేకపోవడాన్కి ఇదే కారణం.

నేను మీ వైపు అదేపనిగా దేబిరించి చూసేనేమో-నాకు గుర్తులేదు. ఇన్‌ఫేక్ట్, ఇప్పుడు మిమ్మల్ని నేను గుర్తుపట్టలేను కూడా. ఎందుకంటే, నేను చూసింది మిమ్మల్ని కాదు. మీరు కట్టుకున్న ఆ పచ్చపువ్వుల పట్టుచీరని; ఆ చీరని; చూడగానే గతించిన ఆనందపు టనుభవాలన్నీ గుర్తుకొచ్చి నన్ను వివశుణ్ణిచేసినై. ఐదేళ్ళ క్రితం నా జీవితంలో స్నేహితురాలిగా ప్రవేశించిన ఓ అందాలరాణికి పుట్టినరోజు కానుకగా సమర్పించుకున్న 'పచ్చపువ్వుల పట్టుచీర', మీరు ధరించిన చీర ఒకేలా గుండటం, అది నేను చూడడం ఈ ఉత్తరాన్ని మీకు వ్రాయడాన్కి కారణం. ఆ వ్యక్తి తర్వాత నా జీవిత భాగస్వామినిగా మారి, నా కలలకీ, ఊహాలకీ, అంతస్థులు

కట్టి; నా జీవితానికో అర్థం కల్పించి, నాకో కలలపంటని మిగిల్చి, ఒకనాటి రాత్రి ప్రమాదంలో తను దిక్కుల్లో, దిగంతాల్లో కల్సిపోయింది! ఆనాటి ఆమె చితిస్మృతే, ఈనాడు నాకు వెలుగై, నా శాపగ్రస్థ జీవితాన్కి; నా చీకటి జీవితాన్కి దారి చూపుతోంది. నాఊహల్ని అనుక్షణం ఉరితీసే జ్ఞాపకాల బారినుండి తప్పించు కొందామనే నా ప్రయత్నం ప్రతిసారీ విఫలమైపోతూనే ఉన్నది. ఆరోజు, మీరు కట్టుకున్న ఆ చీర మళ్ళీ నా పాతజీవితాన్ని గుర్తుకుతెచ్చి, నన్ను మానసికంగా కృంగ దీసివేసింది. ఇప్పుడామె ఆ చీరా, ఆమె జ్ఞాపక చిహ్నాలు.... ఎక్కడున్నాయో, ఏమో! ... మనిషిని పోలిన మనుష మున్నట్టే, చీరని పోలిన చీరలెన్నో ఉంటై. ఒక్కొక్కరికిఆనందం కల్గించే విషయాలు, మరికొందరికి విషాదం కల్గిస్తుంటై. సృష్టి తీరే అంత! అంతమాత్రాన ఒకరికోసం మరొకరు ఆనందాన్ని చంపుకోకూడదు. మీ పచ్చపువ్వుల పట్టుచీరని అమూల్యంగా చూసుకోండి. జీవితంలో హాయిగా, ఆనందంగా, అందంగా అల్లరిచెయ్యండి. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండండి. ఆల్ ద బెస్ట్ టు యూ; ఇట్లు; కళ్ళుండీ వెలుగుని చూడలేని, అందాన్నీ చూసినా ఆనందంగా నవ్వే అదృష్టంలేని, మీరను కున్న, 'బ్లైండ్ ఫెలో.'

ఉత్తరాన్ని పూర్తిచేసిన శాంతి కుర్చీలో అలానే కూలబడిపోయున్నది. ఎందుకో వెక్కివెక్కి ఏడ్చింది. చీరకొంగుతో కళ్ల తుడుచుకున్నది. చుట్టూ కలయజూసి, బట్టల స్టేండ్ దగ్గరకు ఒక్క ఊపులో వెళ్ళింది. వెనకగా వ్రేళ్ళాడుతున్న 'పచ్చ పువ్వుల పట్టుచీర'ని జాగ్రత్తగా మడతలు పెట్టి, పేక్ చేసి, సూట్ కేస్ అట్టడుగున పదిలపర్చింది. ఓసారి బరువుగా నిట్టూర్చి, 'జ్యోతీ!' అనరుస్తూ, జ్యోతి రూమ్‌కేసి పరుగుతీసింది.

* * *

రోజూ ఎన్నో నెంబర్ బస్‌లలో ప్రయాణం చేస్తూనే ఉన్నది శాంతి. ఎప్పుడు బస్‌లో కూర్చున్నా ఆమె విశాల నేత్రాలు ఎవరికోసమో గాలిస్తూనే ఉంటై. ఆ అన్వేషణలో, నిరాశతో, నిస్పృహతో, అశాంతితో సతమతమైపోతూనే ఉంటుంది 'శాంతి.'

అంకితం :

కృష్ణవేణి దివ్యస్మృతికి

——అందే గోపాలకృష్ణమూర్తి.

